క్లుప్తంగా

నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.6.18 లక్షలు



కోడూరు: కృష్ణాతీరంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపును దేవదాయ అధికారులు బుధవారం నిర్వహించారు. తొమ్మిది నెలలకు గాను హుండీ ద్వారా రూ.6,18,624 ఆదాయం లభించిందని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ కగ్గ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

చల్లపల్లి: సంక్రాంతి వేడుకలు స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు భోగి మంటలు వేశారు. ఎస్‌ఐ సీహెచ్ చినబాబు అతిథిగా విచ్చేసి భోగి మంటలు వెలిగించారు. విద్యార్థినులు పట్టు వస్త్రాలతో హాజరై రంగవల్లికలు తీర్చిదిద్దారు. ప్రిన్సిపాల్‌లు పి.రమేష్‌బాబు, అబ్దుల్ రహీం పర్యవేక్షించారు.

ఈవీఎంలపై అవగాహన

కృత్తివెన్ను: ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జెడ్పీటీసీ మైల రత్నకుమారి అన్నారు. మండల పరిధిలోని చినగొల్లపాలెం, పడతడిక పంచాయతీలోని 209 నుంచి 216 వరకు గల 8 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామాలలో బూత్‌ల వారీగా అధికారులు ముందస్తుగా మాక్ పోలింగ్ నిర్వహించడం మంచి విషయమని ఆమె అన్నారు. ఓటింగ్ విధానాన్ని ప్రజలకు వివరించడంతో పాటు ఓటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఎంఆర్‌ఐ కె. శివప్రసాద్, సర్పంచ్ సునీల్, వీఆర్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నాగాయలంక: జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని బ్రాంచి చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, బండ్రెడ్డి హరి బుధవారం తెలిపారు. కృష్ణానది తీరంలోని పర్యాటక శాఖ ఫుడ్ కోర్టు భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. రక్తదాతలు సెల్: 80996 87677, 98888 99966, 78935 65565 నంబర్లకు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వృద్ధురాలి కార్నియాల సేకరణ



సీతామహాలక్ష్మి (ఫైల్)

నాగాయలంక: 11వ వార్డుకు చెందిన వృద్ధురాలు కైతేపల్లి సీతా మహాలక్ష్మి (92) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను విజయవాడ (తాడిగడప) ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. మృతురాలి నేత్రాలను దానం చేసేందుకు ఆమె కుమారుడు సీతారామయ్య, నలుగురు కుమార్తెలు స్వచ్ఛందంగా ముందుకువచ్చారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

14న ముగ్గుల పోటీలు

నాగాయలంక: తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ నెల14న నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రంలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తామని క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14న ఉదయం 10 గంటలకు నియోజకవర్గం స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీ ఏర్పాటు చేశామని, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తిగల మహిళలు క్షేత్ర పాలకుడు తలశిల రఘుశేఖర్ సెల్: 94905 77899 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

117 మద్యం సీసాలు స్వాధీనం

కృత్తివెన్ను: అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న, రవాణా చేస్తున్న వ్యక్తులపై పోలీసులు దాడులను ముమ్మరం చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు, మండల పరిధిలోని పలు చోట్ల జరిగిన దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 117 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉంటే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సిగ్నల్ లైట్ పోల్‌ను ఢీకొట్టిన టిప్పర్ లారీ

మచిలీపట్నంటౌన్: లోడ్‌లో వస్తున్న టిప్పర్ లారీ బుధవారం స్థానిక మూడు స్తంభాల సెంటర్‌లోని సిగ్నల్ లైట్‌ను ఢీకొంది. సిగ్నల్‌లైట్ పక్కకు ఒరిగింది. టిప్పర్ లారీని సెంటర్‌లో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సాయంతో పక్కకు పెట్టించారు. వంగిపోయిన సిగ్నల్ లైట్ స్తంభాన్ని సరిచేయించారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



చల్లపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపకల్పన చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల నుంచి 15 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. పోటీల ఫైనల్ మ్యాచ్ చల్లపల్లి గ్రామ సచివాలయం-2, మాజేరు గ్రామ సచివాలయం జట్ల మధ్య జరిగింది. ఫైనల్‌లో బొమ్మిడి నాంచారయ్య (విష్ణు) నాయకత్వంలోని మాజేరు జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. కార్యక్రమంలో ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, మాతంగి రమ్య, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్ షాద్ నజరానా, ఏపీ ఆగ్రో డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, గంజాల శ్రీను, పంచాయతీ ఈఓలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

● నాగాయలంక: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను బుధవారం నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ఆణిముత్యాలను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌ను 40 రోజులకు పైగా వివిధ స్థాయిల్లో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ పోటీల్లో మొత్తం 137మంది క్రీడాకారులు మండల స్థాయిలో ఆడుతున్నారని చెప్పారు. తహసీల్దార్ జె.విమలకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

● పెడన: మండల స్థాయి కబడ్డీ పోటీలను నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు స్థానిక సర్పంచ్ పరసా నరసింహారావు, ఎంపీటీసీ బొల్లా ఉదయ్‌కుమార్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారిని రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు పోటీలు దోహదపడతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్‌ఎస్ రెడ్డి, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ వి. కృష్ణవేణి స్థానిక అధికారులు, పీడీలతో కలిసి ప్రారంభించారు. మొదటి రోజు వాలీబాల్ పోటీలు జరిగాయి. మండలంలోని 16 సచివాలయాల నుంచి పురుషులు, మహిళలు కలిపి 32 టీంలు పాల్గొన్నాయి. పలు పాఠశాలల పీడీల పర్యవేక్షణలో 30 పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మల్లంపూడి, ములపర్రు జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చోరంపూడి, పెదతుమ్మిడి జట్లు నిలిచాయి. వీటిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాయని పీడీ మోహన్‌రావు తెలిపారు. పురుషుల విభాగంలో విజేతలుగా నిలిచిన మల్లంపూడి, ములపర్రు జట్లుకు రూ. 1200, రూ. 600లను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్ అందచేసి అభినందించారు. ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంఈఓలు బి. త్రిపురసుందరీదేవి, వి. వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ సుందరి పర్యవేక్షించారు.

ఉత్తమ క్రీడాకారుల గుర్తింపు..

మచిలీపట్నంటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా ఉత్తమ క్రీడాకారులను గుర్తించి వారిని ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లేందుకు జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా రెండో విడత నగర స్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికితీసి వారిని ఉన్నత స్థానానికి చేర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కమిషనర్ చంద్రయ్య, 9వ డివిజన్ కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, బూరగ రామారావు, క్రీడల పర్యవేక్షకుడు కేవీఎస్ ప్రసాద్, పీఈటీలు రమేష్‌కుమార్, దీక్షితులు పాల్గొన్నారు.

● కోనేరుసెంటర్: బందరు మండలం గుండుపాలెం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి కబడ్డీ పోటీలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆయన మాట్లాడారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలకు 25 జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణారావు, ఎంఈఓ దుర్గాప్రసాద్, గుండుపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుండుపాలెంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పేర్ని కిట్టు



బంటుమిల్లిలో వాలీబాల్‌లో తలపడుతున్న జట్లు



బందరులో ఖోఖోలో పాల్గొన్న క్రీడాకారులు



నాగాయలంక హైస్కూల్ గ్రౌండ్స్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని ప్రధాన కూడలి కోనేరుసెంటర్ సర్కిల్‌లో పూలమొక్కలను నాటే పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని సెంట్రల్ డివైడర్లతో పాటు కోనేరుసెంటర్‌లో పూలమొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి పెడన రోడ్డు వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర సెంటర్ డివైడర్‌లో మొక్కలతో పాటు పూల మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్ మేకల సుబ్బన్న, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ధనికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఖ్యాతి మహోన్నతం

చల్లపల్లి: దేశానికి మహోన్నత రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ ఖ్యాతి మహోన్నతం అని ఎంపీడీఓ చేకు చినరాట్నాలు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక గ్రామ పంచాయతీ వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జన భాగీదారీ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ మాధవేంద్రరావు, ఎస్సీ నాయకులు దాసి సీతారామరాజు, కైతేపల్లి దాస్ పాల్గొన్నారు.

● నాగాయితిప్ప(మోపిదేవి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు ఆచరణీయని నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. నాగాయితిప్ప గ్రామంలో జన భాగీదారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోపిదేవిలంక సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, పాల కేంద్రం అధ్యక్షుడు పుప్పాల సతీష్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● మంత్రి జోగి రమేష్
● తరకటూరులో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్‌ను అందజేసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: మధ్యవర్తిత్వం, అవినీతికి తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం తరకటూరు సచివాలయం పరిధిలోని తరకటూరు, పినగూడూరులంక గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారంపై స్థానిక అధికారులకు అప్పటికప్పుడే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో కాలు పోగొట్టుకున్న తోట వినయ్ బాబును పరామర్శించిన మంత్రి ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితి బాగుపడినప్పుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసంతో అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. యావత్ భారతదేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు జగనన్న అమలు చేస్తున్నారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏదైనా పథకం ద్వారా లబ్ధి పొందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అవినీతికి తావులేని పాలన అందించడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనన్న బృహత్తర లక్ష్యంతో గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థకు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న జగనన్నకు సంపూర్ణ మద్దతు పలికి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు.

పినగూడూరులంకలో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పినగూడూరులంక, పర్ణశాల, తరకటూరుపాలెం గ్రామాల్లో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పర్యటించారు. పార్టీ శ్రేణులు, సచివాయల సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లిన రాజీవ్ సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

రైతులకు విస్తృత సేవలందించాలి..

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా తరకటూరులో రూ.26.5 లక్షల వ్యయంతో గ్రామంలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం, గోదాములను మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు విస్తృత సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని కోరారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేస్తూ గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, సర్పంచ్‌లు చిన్నం వెంకట రమణమ్మ, రాహెతున్నీసా, పీఏసీఎస్ చైర్మన్ గళ్ల నాంచారయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం పెదబాబు, మోటేపల్లి రత్నారావు, గొరిపర్తి రవికుమార్, జక్కా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రత్యేక స్టాల్స్

కోడూరు: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ బుధవారం కోడూరులో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత రేషన్ సరుకులు, ఆధార్ సీడింగ్ విధానం, భూసార ఆరోగ్య పరీక్షలు, నానో మందులు, ప్రకృతి వ్యవసాయం విభాగాల స్టాల్స్‌ను మంత్రి పరిశీలించి అధికారులను అభినందించారు. డ్రోన్ సాయంతో రసాయన మందుల పిచికారీ విధానాన్ని పరిశీలించారు. ఉజ్వల పథకం ద్వారా ఇద్దరు మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను, ఆయుష్మాన్ భారత్– వైఎస్సార్ ఆరోగ్యశ్రీకు సంబంధించిన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర సహాయ మంత్రికి డీపీఓ నాగేశ్వరనాయక్, ఆర్డీఓ శ్రీవాణిలు జ్ఞాపికను అందించి సత్కరించారు. కేంద్ర ఐఏఎస్ అధికారి ఎం.రామచంద్రుడును సన్మానించారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి యశోనాయక్

సాగర సంగమం అభివృద్ధి చేయాలని వినతి

కోడూరు: హంసలదీవి కృష్ణా సాగర సంగమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్‌కు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. తీరంలో అవసరమైన వసతులను వివరిస్తూ మంత్రికి వినతిపత్రం అందించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట పద్మావతి వరప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులను సన్మానించిన కేంద్ర మంత్రి

కోడూరు: వాటర్ స్పోర్ట్స్ కానో స్లాలమ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు క్రీడాకారులను కేంద్ర మంత్రి సన్మానించారు. నాగాయలంకకు చెందిన ఎస్.గాయత్రి, అదే మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగి రోహిత్, ఎస్.భానును కేంద్ర సహాయమంత్రి అభినందించారు. వారిని మంత్రి యశోనాయక్ దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. మరింత ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

● మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం కేంద్రం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకం కింద రూ. 50 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రికి ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు వినతిపత్రం అందజేశారు.

సంతకాల సేకరణ, ప్రతిజ్ఞ

మచిలీపట్నంటౌన్: విజయవాడ స్మృతివనంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఈ నెల 19వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో నగరంలోని 36వ డివిజన్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంకు మద్దతుగా సంతకాలు చేశారు. బీఆర్ అంబేడ్కర్ చూపిన సామాజిక న్యాయమార్గంలో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, యువజన విభాగం కన్వీనర్ దమ్ము కేశవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పత్తిపాటి ప్రేమ్‌కుమార్, ప్రదీప్, చింతపట్ల నాని తదితరులు పాల్గొన్నారు.

● కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్యమంత్రికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతోంది. ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులరించారు. అంబేడ్కర్ విగ్రహాలను సుందరంగా అలంకరించి అదే ప్రాంతంలో సంతకాలు చేస్తున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ.. రూ. 2.50 లక్షలు స్వాధీనం

బంటుమిల్లి: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై ఎస్‌ఐ ఎ. పైడిబాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. బుధవారం తనిఖీలు చేస్తుండగా భీమవరం నుంచి ఒంగోలు వెళుతున్న కారులో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని రూ. 2.50 లక్షలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పైడిబాబు మాట్లాడుతూ మద్యం విక్రయాలు, పందేలు తదితర జూదాలతోపాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాలీబాల్ మండల విజేత మాట్లాం జట్టు

కృత్తివెన్ను: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ముగిశాయని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు. ఉదయం నుంచి సంగమూడి, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలల్లోని క్రీడామైదానాల్లో పోటీలు జరిగాయి. నీలిపూడి, మాట్లాం గ్రామాల జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా మాట్లాం జట్టు విజేతగా నిలిచి నియోజవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని ఆయన చెప్పారు. మండల స్థాయి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

చల్లపల్లి: చల్లపల్లి ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో 1974–76 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం జరిగింది. 60 మంది మిత్రులు కలిసి తాము చదువుకున్న తమ తరగతి గదులు, అప్పటి బెంచీలు చూసి మురిసిపోయారు.



1974-76 ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పెన్షనర్ల దాతృత్వం

మచిలీపట్నంటౌన్: 34వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛనుదారు పన్నెంరెడ్డి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 24,600లను వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ బడే భానుతేజ, సచివాలయ కన్వీనర్ ప్రేమ్‌కుమార్, గృహ సారథులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగానికి బుధవారం రాత్రి అభిషేకాలు, విశేష పూజ నిర్వహించారు. అనంతరం భక్తులు స్వీయ అభిషేకాలు చేశారు. రామలింగేశ్వరుడు, నందీశ్వరులకు పూజలు జరిపారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 11, 25 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పేదలు ఎవ్వరూ అనారోగ్యంతో దీర్ఘకాలం ఉండకుండా సంబంధిత వైద్యుడ్ని సంప్రదించి చికిత్స పొందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారన్నారు. దీనిలో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యానికి రూ. 25 లక్షలకు సీఎం జగన్ పెంచారన్నారు. వైద్య శిబిరాల వద్ద మందుల పంపిణీ, రక్త, ఈసీజీ పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, 11, 25 డివిజన్ల కార్పొరేటర్లు గూడవల్లి నాగమణి, కొలుసు విజయగంగ, వైఎస్సార్ సీపీ నాయకులు కొలుసు హరిబాబు పాల్గొన్నారు.



బందరు వైద్యశిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

జూదరుల అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలంలోని పలు గ్రామాల్లో బందరు రూరల్ పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను పట్టుకున్నారు. కొత్తపూడి గ్రామంలో పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ చాణక్య సిబ్బందితో కలిసి దాడి చేయగా నలుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1,650 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్‌ఐ చాణక్య చెప్పారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

గూడూరు: మండలంలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలను విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు 39 బృందాలుగా ఏర్పడి 1,943 గృహ సర్వీసులు, 85 వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. వాటిలో 144 సర్వీసులకు అదనపు లోడు వాడుతున్నట్లు గుర్తించి రూ.5.2 లక్షలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఈ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మచిలీపట్నం ఈఈ ఎం.భాస్కరరావు, డీఈ ఎం.శ్రీనివాసులు, మచిలీపట్నం, మచిలీపట్నం రూరల్ డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.